# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 19 వ భాగం

### *హిరణ్యకశిపుడు, ప్రహ్లాద చరిత్ర – 1*

బ్రహ్మ ఇచ్చిన కోరికల్తో అందర్నీ జయించి ఇష్టం వచ్చినట్టూ జనాల్ని వేపుకు తినడం మొదలుపెట్టాడు కదా హిరణ్యకశిపుడు? ఈ స్థితిలో హిరణ్యకశిపుడికి నలుగు కొడుకులు పుట్టేరు. అందులో ఒకడే ప్రహ్లాదుడు. అహర్నిశలూ హిరణ్యకశిపుడు కోపంతో హరిని తల్చుకుంటూంటే అతడి కొడుకు భక్తితో తల్చుకుంటున్నాడు. మనకి ఇక్కడ కథలో కాస్త ఉత్కంఠ. శ్రీహరితో అంతటి శతృత్వం ఉన్న తండ్రికి అటువంటి కొడుకు ఎలా పుట్టేడా అని. ప్రాణులు పుట్టడం వరకే కానీ వాటి వాటి కర్మల్లో భేధం ఉంటుంది కదా? ఒకే తల్లికి పుట్టిన పిల్లలందరూ ఒకేలాగ బతకలేరు. దీన్నే బైబిల్ లో కూడా – ఎవడి శిలువ వాడు మోసుకోవల్సిందే అని చెప్తూ ఉంటారు. కొంచెం లోతుగా ఆలోచిస్తే, భగవంతుడు అంతటి క్రూరుడైన హిరణ్యకశిపుడికి కూడా మారతాడేమో నని ఇంకో అవకాశం ఇచ్చి చూస్తున్నాడు కొడుకు రూపంలో.

హిరణ్యకశిపుడు ఇలా కోరికలు కోరతాడనీ, తర్వాత ఇవన్నీ జరుగుతాయనీ శ్రీహరికి ముందే తెలుసు. అందుకే అతడలా తపస్సుకి వెళ్లగానే లీలావతి దగ్గిరకి నారదుణ్ణి పంపించి శ్రీ హరి కథ చెప్పించాడు ప్రహ్లాదుడు ఇంకా కడుపులో ఉండగానే. గురువిచ్చే మంత్రం కానీ దీక్ష కానీ ఒక బీజం వంటిది. అది ఒకసారి నాటబడితే సరైన వాతావరణం కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఒకసారి అటువంటి వాతావరణం ఏర్పడగానే మహావృక్షమై ఎదగడం మొదలౌతుంది. అప్పుడు మనలో ఉండే రాక్షసత్వం దానికదే అంతరిస్తుంది. సరిగ్గా ఇదే నారదుడు చేసాడు గురువుగా. ప్రహ్లాదుడికి దీక్ష ఇచ్చి తప్పుకున్నాడు ఏమీ తెలియనట్టూ.

Murphy's Law అనేది ఒకటి చెప్తూ ఉంటారు. దీని ప్రకారం దేనికైతే పాడవడానికి శతసహస్రాంసమైనా అవకాశం ఉందో అది పాడయ్యి తీరుతుంది. దీన్ని జీవితంలో అనుకోని పరిస్థితుల వల్ల వచ్చే సంఘటనలని చెప్పడానికి వాడుతూ ఉంటారు. ఇప్పుడు సరిగ్గా ఇదే హిరణ్యకశిపుడికి జరిగింది. హిరణ్యకశిపుడి కోరిక ప్రకారం చూస్తే ఎక్కడా తేడా రావడానికి వీలు లేదు అవునా? కానీ అది మన ఆలోచన ప్రకారం. కొంచెం లోతుగా ఆలోచిస్తే "అవునవును వీడు చావడానికో అవకాశం ఉంది కానీ అది చాలా తక్కువ అవకాశం" అనిపిస్తోందా? సరిగ్గా అదే ఈ Murphy's Law.

ఏ తపస్సైతే తనని అమరుణ్ణి చేస్తుందనుకున్నాడో ఆ తపస్సు చేసే సమయంలో తన ఇంట్లో తన నాశనానికి బీజం పెట్టబడింది అదీ తన స్వంత కొడుకు రూపంలో. ఇప్పుడో సారి భగవంతుడి గురించి ఆలోచిద్దాం. భగవంతుడు అవ్యక్తుడు. మన మనసుకి గానీ బుద్ధికిగానీ అందేవాడు గాదు. ఇంక ఇంద్రియాల సంగతెందుకు? కానీ వీటన్నంటినీ పక్కనబెట్టి – "ఎవ్వనిచే జనింతు జగమెవ్వని లోపలనుండు.." అనగానే సంతోషంగా వాయువేగ మనోవేగాలతో పరుగెట్టుకుంటూ వస్తాడు ఆయన. హిరణ్యకశిపుడు చేసే ఈ తపస్సు అలా జరుగుతూండగానే అతడిలో రాక్షసత్వం పోవడానికి సరిగ్గా

అప్పుడే భగవంతుడు ఏర్పాట్లు చేసేడు. ఆయన భూత భవిష్యత్ వర్తమానాలు తెలిసినవాడు కనక భగవంతుడు. ఇప్పుడు పుట్టిన ప్రహ్లాదుడెలాంటివాడు? ఇదిగో చెప్తున్నాడు పోతన సీస పద్యంలో.

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ జేరిన యట్లైన,
జెలికాండ్ర నెవ్వరిఁ జేర మఱచు;
నసురారి దనమ్రోల నాడిన యట్లైన,
నసురబాలురతోడ నాడ మఱచు;
భక్తవత్సలుఁడు సంభాషించినట్లైన,
బరభాషలకు మాఱుపలుక మఱచు;
సురవంద్యుఁ దనలోనఁ జూచినయట్లైనఁ,
జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు; [7-122]

తే. హరిపదాంభోజయుగ చింతనామృతమున
నంతరంగంబు నిండినట్లైన, నతఁడు
నిత్య పరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడుని భంగి. [7-122.1]

విష్ణువు గురించి ఆలోచన రాగానే ఇంక ఎవరూ గుర్తుండరు అతనికి. పక్కనున్న పిల్లల్తో ఆటలన్నీ మర్చిపోతున్నాడు. ఎవరితోనూ మాట్లాడడు. అన్నీ మరిచిపోయి జడుడిలాగా ఉండిపోతున్నాడు. ధృవుడి కథ చదువుకున్నప్పుడు చెప్పుకున్నాం "శుచీనాం శ్రీమతాంగేహే యోగభ్రష్టోభిజాయతే " అని. ప్రహ్లాదుడు కూడా ఇటువంటివాడే. మిగిలిపోయిన ఆ కాస్త కర్మ ఈ జన్మలో తీరిపోబోతోంది. కానీ ఆ కర్మ ప్రకారం తాను తన తండ్రికి పట్టిన దరిద్రం వదిలించి మరీ జన్మ రాహిత్యం పొందబోతున్నాడు. దానికోసం ఇక్కడ తండ్రీ కొడుకులు సరిగ్గా ఒకరికొకరు అమర్చ బడ్డారు. కానీ కోరికలు తీరడం వల్ల వచ్చే అహంకారం అంత త్వరగా అంతరిస్తుందా?

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు చేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీచింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డే తద్విశ్వమున్ భూవరా! [7-123]

ఏ పని చేస్తున్నా శ్రీహరి నామస్మరణతో ఉండేవాడు. అందులో ఎంతగా లీనమైపోయాడంటే బాహ్య ప్రపంచం గుర్తుకు వచ్చేది కాదు. ఇదంతా అంతటి రాక్షసుడి కొడుక్కి ఎలా అబ్బింది? రెండు కారణాలు. ఒకటి పూర్వ జన్మలోచేసుకున్న కర్మ. రెండు – నారదుడంతటి గురువిచ్చిన దీక్ష. ఇదంతా నారదుడు ధర్మరాజుకి చెప్తున్నాడు కదా, ధర్మరాజు అడగవచ్చేమో ఇవెలాగా అని ముందే చెప్తున్నాడు.

వ. ఇట్లు పూర్వజన్మపరమభాగవత సంసర్గసమాగతంబైన ముకుంద చరణారవింద సేవాతిరేకంబున నఖర్వ నిర్వాణభావంబున విస్తరించుచునప్పటప్పటికి దుర్జన సంసర్గ నిమిత్తంబునం దనచిత్తం బన్యాయత్తంబుగానీక నిజాయత్తంబు చేయుచునప్రమత్తుండును, సంసార నివృత్తుండును, బుధజనవిధేయుండును, మహాభాగధేయుండును, సుగుణమణిగణగరిష్ఠుండును, పరమభాగవతశ్రేష్ఠుండును, కర్మబంధలతాలవిత్రుండును, పవిత్రుండును నైన పుత్రుని యందు విరోధించి సురవిరోధి యనుకంపలేక చంపం బంపె" నని పలికిన నారదునకు ధర్మజుం డి ట్లనియె. [7-125]

ఇప్పుడు ప్రహ్లాదుడికి శ్రీహరి నామం తప్ప వేరే లోకం లేదు. తండ్రి ఎంత నిర్దాక్షిణ్యంగా శ్రీహరిని ద్వేషిస్తున్నాడో కొడుకు అంత భజిస్తున్నాడు. వీళ్ళిద్దరికీ ఎలా పెట్టాడో చూసారా జత? ఏ నామం అయితే తనకి వినపడకూడదని అనుకున్నాడో అదే నామం స్వంత కొడుకు అహర్నిశలూ జపిస్తున్నాడు. హిరణ్యకశిపుడు ఇంక తట్టుకోలేక "వీణ్ణి చంపి పారేయండిరా" అన్నాడు.

ఉ. బాలుఁ బ్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలుఁ గృపాళు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్త సభ్యనుతశీలు విఖండితమోహవల్లికా
జాలు న దేల? తండ్రి వడిఁ జంపఁగఁ బంపె మునీంద్ర! చెప్పవే. [7-127]

ఇదేమిటండోయ్, ఎంత శతృవు నామం జపంచేసినా కొడుకంటే కాస్త ప్రేమ ఉండదూ? అదీ అంతటి హరిపాదపయోరుహచింతనాక్రియలోలుడి మీద? కోపం రావచ్చేమో గాక మరీ చంపించడమా? ఇదేమి వింత అని అడుగుతున్నాడు యుధిష్టరుడు నారదుణ్ణి.

ఇప్పుడు అసలు మొదట్నుంచీ జరిగిన మొదలుపెడుతున్నాడు నారదుడు. ముందిలా ప్రహ్లాదుడు శ్రీహరి పేరు చెప్పగానే అన్నీ వదిలేసి జడుడిలాగా పడి ఉండడం చూసాడు తండ్రి. వీడికి చదువూ సంధ్యా లేదు అందుకే ఇలా ఉన్నాడు అనుకున్నాడు కామోసు. దగ్గిరకి పిల్చి ఇద్దరు గురువులని చూపించి అచ్చం తండ్రిలాగానే చెప్తున్నాడు. హిరణ్యకశిపుడు శ్రీహరికి శతృవే కానీ తన తండ్రి బాధ్యతలు మర్చిపోయేంతటి వాడు కాదు.

క. చదువనివాఁ డజ్ఞుం డగు
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ! [7-130]

ఒరే అబ్బాయీ, చదువులేకపోతే అజ్ఞానంతో ఉండిపోతావు. మనదగ్గిర మాంచి ఆర్యులైన గురువులున్నారు. వాళ్ళ దగ్గిర చదివిస్తాను. చదువుకోరా అని చెప్పి శుక్రాచార్యుల కొడుకులైన చండామార్కులతో ఇలా చెప్పేడు.

శా. అంధప్రక్రియ నున్నవాఁడు, పలుకండ స్మత్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు, మీరు గురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు, మముంబాటించి యీబాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గావించి రక్షింపరే." [7-132]

వీడేమో జడుడిలాగా అంధకారంలో ఉన్నాడు. వీడిని తీసుకెళ్ళి గ్రంథాలు చదివించండి, నీతిశాస్త్రం అంతా నేర్పి రక్షించాలి అన్నాడు. ఇలాంటి విషయాల్లోనే హిరణ్యకశిపుడిలాగే మనం కూడ ఉంటాం జీవితంలో. చదువులు చదువుతాం, ఉద్యోగాలు చేస్తాం. డబ్బులొస్తాయో, పోతాయో ఏదో ఒకటి అవుతుంది. కానీ చివరకి మనం సాధించిందేమిటీ అని వెనక్కి తిరిగి చూసుకుంటే, దాదాపు అందరిదీ ఒకే రకమైన సమాధానం – ఏమీ లేదు. స్వామి వివేకానంద కూడా ఇదే అంటారు. కొన్ని లక్షలు ఖర్చుపెట్టి ఒక ఆసుపత్రి కట్టిస్తాం. ఒక్క భూకంపంతో అది సర్వనాశనం అవ్వొచ్చు. ఒక ముప్ఫై నలభై ఏళ్ళలో మనం ఎవరమో కూడా ఎవరికీ గుర్తుండదు. మరి బ్రహ్మ జ్ఞానం సంపాదించిన వ్యక్తులో? ఒక రామకృష్ణులో, ఒక వివేకానందో, ఒక రమణ మహర్షినో అడిగితే? వాళ్ల జీవితం పరిపూర్ణం.

ప్రహ్లాదుడు బ్రహ్మజ్ఞానం కోసం పాటుపడుతూంటే వాణ్ణి తీసుకెళ్ళి నీతి శాస్త్రం నేర్పమంటున్నాడు హిరణ్యకశిపుడు. ఇదే శంకరులు అంటున్నారు చూడండి శివానందలహరిలో.

ఘటోవా మృత్పిండో ప్యణురపి చ ధూమోగ్ని రచలః
పటోవా తంతుర్వా పరిహరతి కిం ఘోరశమనం
వృధా కంఠక్షోభం వహసి తరసా తర్కవచసా
పదాంభోజం శంభోర్భజ పరమసౌఖ్యం వ్రజ సుధీః [శివానంద లహరి – 6]

కుండలు చేయుటకు మట్టి సాధనము. దానికి పరమాణువులు కారణం. కొండ మీద పొగ కబడుతోంది, కాబట్టి నిప్పు అక్కడ ఉంటుంది. బట్టలు దారము వలన జనించును. ఈ తర్క శాస్త్ర విషయాలలో ఏ ఒక్కటీ కూడా మృత్యువుకి అడ్డుపడేది కాదు. ఇవి పిడివేసి వల్లించి కంఠస్థం చేసుకోవడం ఎందుకు? వృధా. మోక్షం శివభజన వల్లే పొందగలిగేది.

జ్ఞానం కావాలనుకునేవాడికి ప్రాపంచిక విషయాలు అఖ్ఖర్లేదు. కఠోపనిషత్తులో యముడు నచికేతుడికి రాజ్యం ఇస్తాను, దీర్ఘాయుష్షు ఇస్తాను, సర్వ సంపదలూ ఇస్తా, ఇవి ఇస్తా, అవి ఇస్తా అని ప్రలోభపెట్టడానికి చూస్తాడు. అప్పుడు చెప్తాడు నచికేతుడు,

శ్వోభావ మర్త్యస్య యదంతకైతత్
సర్వేంద్రియాణాం జరయంతి తేజః
అపి సర్వం జీవితమల్పమేవ
తవైవ వాహాస్తవ నృత్యగీతే. (కఠోపనిషత్తు – 26)

నువ్విచ్చేవాటికన్నింటికీ ఒక మొదలు ఉంది. అంటే తుదికూడా ఉంటుంది. వీటి వల్ల క్షణికానందమే కానీ వేరే ఏమీలేదు. వీటిలో తేలి మేము జరా మరణాలు పొందుతూ ఉంటాం. ఎంతపొడిగించినా జీవితం అల్పమే కదా? ఇవన్నీ నీదగ్గిరే ఉంచుకో. నాకు అక్కరలేదు.

న విత్తేన తర్పణీయో మనుష్యో
లప్స్యామహే విత్తమద్రాక్ష్మ చేత్త్వా
జీవిష్యామో యావదీశిష్యసి త్వం
వరస్తు మే వరణీయః స ఏవ. (కఠోపనిషత్తు – 27)

ఎంత ధనం ఉన్నా కూడా ఎవరూ తృప్తిపడేటట్టు కనిపించదు. అదీగాక చావు గురించి నీ దగ్గిర్నుంచి తెలుసుకున్నాక సంపద అదే వస్తుంది [శివానందులు చెప్పినట్టుగా – Realize the Brahman or the Absolute the attainment of which leaves nothing

more to be attained, the blessedness of which leaves no other blessing to be desired, the knowledge of which leaves nothing more to be known]. అందుచేత సంపద కోరుకోవడం అనవసరం. అదీగాక నువ్వు జీవించమన్నంతకాలం మాకు ఆయుర్దాయం ఉండనే ఉంది. మిగతావన్నీ నువ్వే ఉంచుకుని నాకు మరణాంతరం గురించే చెప్పు.

[కఠోపనిషత్తు అనువాదం, దివ్యజీవన సంఘంవారి శ్రీ కృష్ణానంద సరస్వతి]

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS